క్లుప్తంగా

క్షీరాభిషేకం



చెన్నారావుపేట : పాత మగ్దుంపురం గ్రామాన్ని తిరిగి చెన్నారావుపేట మండలంలో కలుపుతూ జీఓ 260ని విడుదల చేయడంతో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిల చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు శనివారం గ్రామ పంచాయతీ ఆవరణలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కంది కృష్ణారెడ్డి, సర్పంచ్ లావణ్య, సాంబయ్య, మహ్మద్ రఫీ, కృష్ణ చైతన్య, మహేందర్, బషీర్, రమేష్, మల్లయ్య, వార్డు సభ్యులు మమత తదితరులు ఉన్నారు.

ఎస్సైగా ఎంపిక



శ్రావణ్‌కుమార్

గీసుకొండ : మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన తాబేటి శ్రావణ్‌కుమార్ రాష్ట్ర పోలీసు శాఖ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) ఎస్సైగా ఎంపికయ్యారు. కాగా ఇప్పటికే ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం గ్రామస్తులు శ్రావణ్‌ను, అతడి తల్లిదండ్రులు వీరస్వామి, సునీతను అభినందించారు.

నిరుపేదలకు చేయూత



చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయిని పహాడ్‌కు చెందిన ఏటుకూరి ఫాదర్ రఫేల్ తన తల్లిదండ్రులు రాయన్న-శాంతమ్మల వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు చేయూతనిచ్చాడు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన దొడ సుజనాకు రూ.3లక్షల విలువ చేసే ఆటో, పసునూరి సారయ్య ఇంటిని నిర్మించుకోవడానికి అయ్యే ఖర్చు అందించి ఔదార్యం చాటాడు. దీంతో గ్రామస్తులు ఫాదర్ రఫేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏటుకూరి జయరాజ్, ప్రవీణ్, బాలజోజి, దేవదానం, విజయ్, తామసయ్య, జయంత్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ఈదులకంటి రవీందర్‌రెడ్డి శనివారం పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. రవీందర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్నారు.

మంత్రి ఎర్రబెల్లి పరామర్శ



నర్సంపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి, వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం పరామర్శించారు. ప్రమాద సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గోల్కొండ శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అందించిన రూ.5వేల నగదును బాధిత కుటుంబానికి నాయకులు శనివారం అందించారు. కార్యక్రమంలో నర్సింహరాములు, వనపర్తి మల్లయ్య, పోతరాజు రాజు ఉన్నారు.

ఎలుకుర్తిలో..

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మైదం శ్రావణ్‌ను 'ఉబుంటు' టీం సభ్యులు శనివారం రూ.5వేల సాయం అందించారు. అలాగే ప్రవాస భారతీయుడు అల్లూరి సునీల్ రూ.5 వేలు ఇవ్వగా అతడి స్నేహితుడు కర్ణకంటి రాంమూర్తి బాధితుడికి అందించారు.

వినతి



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ శివారులో ఏర్పాటు చేసిన వైన్ షాపును మరోచోటకు తరలించాలని గౌడ సంఘం బాధ్యులు శ్రీనివాస్, సాయిలు, వెంకన్న కోరారు. సర్పంచ్ కవిత, ఉపసర్పంచ్ వెంకన్న, కార్యదర్శి జనార్దన్‌లకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఏర్పాటు చేసిన వైన్ షాపు తాటిచెట్ల సమీపంలో ఉన్నందున గౌడ కులస్తుల జీవనోపాధిపై ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో రవి, మల్లయ్య, వెంకన్న, శ్రీను, సారయ్య, నారాయణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం



పెచ్చులూడుతున్న స్లాబ్ పైకప్పు



శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయం

- వర్షాకాలం వచ్చిందంటే తప్పని తిప్పలు
- పెచ్చులూడి పడుతున్న స్లాబ్
- ఆఫీస్‌కు రావాలంటే జంకుతున్న అధికారులు, ప్రజలు

నర్సంపేట రూరల్ : ఏన్నో ఏళ్ల కింద నిర్మించిన భవనం రోజు రోజుకు శిథిలావస్థకు చేరింది తహసీల్ కార్యాలయం.. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే కార్యాలయం చిన్న పాటి వర్షానికే ఆఫీస్‌లోని గదులన్నీ కురుస్తుంటాయి.. పెచ్చులూడి కింద పడిపోతున్నాయి.. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు అధికారులు, ప్రజలు.. ఎన్నిసార్లు మొరపెట్టుకున్న కనీసం పాలకులు, ఉన్నత స్థాయి అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.. ప్రజా ప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు వచ్చినప్పుడు కార్యాలయాన్ని పరిశీలించి నిధులు మంజూరు చేయిస్తామనడమే తప్ప ఇంత వరకూ ఒక్కపైసా వచ్చిన దాఖలాలు లేవు. గత్యంతరం లేకుండా ఆ కార్యాలయంలో అధికారులు విధులు నిర్వహిస్తూ కాలం వెళ్లదిన్నారు.

నర్సంపేట మండలంలోని 27 గ్రామపంచాయతీలతో పాటు, నర్సంపేట పట్టణానికి చెందిన భూ రికార్డులు, రేషన్, ఓటర్ ఐడీ, మీసేవలో కులం, నివాసం, యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు, ధరణి పోర్టల్‌తో రద్దీ పెరిగింది. ఈ కార్యాలయం నుంచి రెవెన్యూ ప్రభుత్వానికి ఉన్నప్పటికి కనీసం నూతన భవనం మంజూరు చేయలేదు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు మారినప్పుడల్లా నూతన భవనం కోసం దరఖాస్తులు చేస్తూనే ఉన్నారు. కానీ నేటి వరకు బిల్డింగ్ మంజూరు కాలేదు. సుమారు 50 ఏళ్ల నాటి బిల్డింగ్ కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడిన, గదులు కురుస్తున్నప్పటికి అధికారులు భయం భయంగానే విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే తహసీల్దార్ కార్యాలయంలో అన్ని గదులన్ని కురుస్తాయని, రికార్డులు సైతం తడుస్తూ ఉంటాయని, దీంతో విలువైన రికార్డులను సైతం కోల్పోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఎంత జాగ్రత్తగా ఉనప్పటికి వర్షం నుంచి కాపాడడం కష్ట సాధ్యంగా మారుతోందన్నారు. వర్షాకాలం వచ్చిందంటే పదిరోజులకోసారి తహసీల్ కార్యాలయంపై నీరు నిల్వ ఉండకుండా వీఆర్ఏలతో సైతం శ్రమదానం చేయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నూతన భవనం మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

భయంగా ఉంది



నర్సంపేట మండల తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. చిన్న పాటి వర్షానికే కార్యాలయం మొత్తం తడిసి పోతోంది. మెయిన్ దర్వాజ గుండా వెళ్లాలంటే భయమేస్తోంది. ఎప్పుడు ఏ పెచ్చులూడి మీద పడిపోతాయోనని భయం భయంగా కార్యాలయానికి వెళ్లి మా పని చూసుకొని వస్తున్నాం. తక్షణమే నూతన భవనాన్ని మంజూరు చేసి నిర్మించాలి.

\- గూడూరు సందీప్, నర్సంపేట

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

వర్ధన్నపేట : ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతల నిర్మూలనకు కృషి చేయాలని వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాత్రి వర్ధన్నపేటలోని పిరింగిగడ్డ ప్రాంతంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జాగృతి బృందం కళాజాతా నిర్వహించారు. కళాకారులు పాటలు, నృత్యాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోత్ అరుణ, వార్డు కౌన్సిలర్ పూజారి సుజాత రఘు, ఎస్సై ప్రవీణ్‌కుమార్, పోలీస్ కళాబృందం నాగమణి(ఏఎస్సై), హెడ్ కానిస్టేబుళ్లు విలియం, వెంకటేశ్వర్లు, సిబ్బంది శ్రీనివాస్, విక్రంరాజు, నారాయణ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించేంత వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చుక్క ప్రశాంత్ అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నర్సంపేట నుంచి చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం వర్ధన్నపేటకు చేరుకుంది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చుక్క ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 645 ప్రభుత్వ పాఠశాలలుండగా అందులో 227 పాఠశాలలకు మాత్రమే నిధులు కేటాయించినప్పటికి 196 ప్రభుత్వ పాఠశాలల్లో ఇంత వరకు అభివృద్ధి పనులు జరగలేదన్నారు. 27 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి జరిగాయని, ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు -మనబడి నిధులు ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. 12 అంశాలను చేర్చి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలు దీటుగా తీర్చిదిద్దుతామని చెప్పినప్పటికి ఇప్పటి వరకు విద్యా వ్యవస్థపై దృష్టి పెట్టకపోవడం సిగ్గుచేటన్నారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ఎంఈఓ పోస్టు ఒక్కటి కూడా రెగ్యులర్ చేయలేదని దుయ్యబట్టారు. రెగ్యులర్ ఎంఈఓ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. నాయకులు ఇస్లావత్ కల్యాణ్, అభి, నితిన్, వంశీ, నిక్షిప్త, దీప్తి, మహేష్, సమీర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విలీనం అమరులకు అంకితం



నివాళులర్పిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నర్సంపేట : ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అమరవీరులకు అంకితం అని నర్సంపేట డిపో నాయకుడు గొలనకొండ వేణు అన్నారు. ఈ మేరకు ఉద్యోగులు శనివారం డిపో ప్రధాన ద్వారం వద్ద ఆర్టీసీ అమరవీరుల చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రభుత్వ విలీనం కోసం, పరిరక్షణ కోసం దేశంలోనే రవాణా కార్మికుల చారిత్రక అక్టోబర్ 2019లో జరిగిన 55రోజుల సుదీర్ఘ సమ్మె విరోచిత పోరాటంలో రాష్ట్ర వ్యాప్తంగా 38మంది ఆర్టీసీ కార్మికులు ప్రాణ త్యాగాలు చేశారన్నారు. వారి ప్రాణ త్యాగాల పోరాట ఫలితమే నేడు ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కాగలిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ భద్రయ్య, ఏడీసీలు సోమ్లా, బత్తిని సాంబయ్య, బొడిగె రాజు, కందికొండ మోహన్ , బూర ప్రవీణ్‌కుమార్, మంద రాజు, గొడిశాల వెంకటేశ్వర్లు, అఫ్సర్‌అలీ, నర్సయ్య, పెద్ద రాజాలు, మొగిలి, శ్రీనివాస్, రాజేందర్, అక్బర్, పాషా, రమాబాయి, శ్రీలత, తేజస్విని, స్వప్న, మౌనిక, దీప్తి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ మృతి





పద్మ (ఫైల్)

నర్సంపేట : నర్సంపేట మున్సిపల్ తొలి వైస్ చైర్ పర్సన్ మునిగాల పద్మ(52) గుండెపోటుతో అమెరికాలో మృతి చెందారు. నెల రోజుల క్రితం మునిగాల వెంకట్‌రెడ్డి-పద్మ దంపతులు అమెరికాలో ఉంటున్న తమ కూతుళ్ల వద్దకు వెళ్లారు. శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. పద్మ మృతి చెందడంతో బాధిత కుటుంబంతో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి అవస్థలు

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని ప్రజలు వారం రోజులుగా నల్లా నీరు రాక తాగునీటికి అవస్థలు పడుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ బత్తిని రాజేందర్ అన్నారు. ఈ మేరకు 18వ వార్డు ప్రజల ఇబ్బందులను గ్రహించిన రాజేందర్ శనివారం సొంత ఖర్చులతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. ఇప్పటికైనా కమిషనర్, చైర్‌పర్సన్ వెంటనే నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌తోనే నిరుద్యోగులకు ఉపాధి



విద్యార్థినులతో మాట్లాడుతున్న నాయకులు

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు రూ.4వేల నిరుద్యోగ భృతి, రూ.10లక్షల వడ్డీ లేని రుణాలు అందిస్తామని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, చింతల సాంబరెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 19వ వార్డులో శనివారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో బీఆర్ఎస్, బీజేపీల మాయ మాటలు నమ్మకుండా వారికి బుద్ధి చెప్పే విధంగా రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి యువజన కాంగ్రెస్ పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సందీప్, దుగ్గొండి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరిగే ప్రవీణ్, కీసరి వెంకటేశ్వర్లు, చింతల కార్తీక్‌రెడ్డి, మోడం ఎల్లగౌడ్, వార్డు యూత్ అధ్యక్షుడు కొండి రాజేష్, కీసరి రాజీవ్, కొలువుల రాంబాబు, కొలువుల స్వామి, కొలువుల ఎల్లస్వామి, రాజు, సబ్బాని శ్రీనివాస్, కాట రాహుల్, కాట అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉషాదయాకర్‌రావు

రాయపర్తి : ఎర్రబెల్లి దయాకర్‌రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు శనివారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మండలంలోని సన్నూరు గ్రామంలో నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు లక్ష్యమని అన్నారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, ట్రస్ట్ పరిశీలకురాలు పంజా కల్పన, పూస మధు, వనజారాణి, సర్పంచ్ నలమాస సారయ్య, ఎంపీటీసీ గోవింద్‌నాయక్, ఉపసర్పంచ్ కొంరమల్లు, గారె నర్సయ్య, ఐత రాంచందర్, పోతుల కొంరమల్లు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలి నాయకులు

సంగెం : పద్మశాలి రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని పద్మశాలి మండల అధ్యక్షుడు కందకట్ల నరహరి పిలుపు నిచ్చారు. నేడు కోరుట్ల పట్టణంలో నిర్వహించనున్న పద్మశాలీల రాజకీయ ఆత్మగౌరవ సభ వాల్ పోస్టర్‌ను శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం పద్మశాలీలు ఉద్యమించాలని అన్నారు. చట్టసభల్లో తమకు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సభకు అన్ని రాజకీయ పార్టీల్లోకి కులబంధువులందరు హాజరుకావాలని కోరారు. నాయకులు బిట్ల సత్యనారాయణ, ఇప్పకాల రమేష్, మనోహర్, విజయ్, బిట్ల రామకృష్ణ, అనుమాండ్ల రమేష్, సుధాకర్, బూర ప్రకాష్, కొంతం వేణు, యాకయ్య, కందకట్ల వెంకన్న సంపత్, కొంతం దశరథం, చిందం వీరస్వామి.శేఖరయ్య పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మదన్‌కుమార్

నర్సంపేట : రాజ్యాంగ పరిరక్షణ బహుజనుల పాత్ర అనే అంశంపై పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ గుండాల మదన్‌కుమార్, రఘుపతి స్వేరో, వాసునాయక్, జేతురాంనాయక్, డ్యాగల శ్రీనివాస్, సాంబరాతి మల్లేషం కోరారు. ఈ మేరకు పట్టణంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభాలో 90శాతం ఉన్న బహుజనులు జనాభా దామాషాలో అన్ని రాజకీయ పార్టీలు 40సీట్లకు తక్కువ కాకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బహుజనులు ఓటు చైతన్యం పొంది బహుజన రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. బంజారా హక్కులు సాధించుకోవాలని, నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని కోరారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బహుజనులు అధిక సంఖ్యలో హాజరై చర్చా వేదికను విజయవంతం చేయాలని కోరారు.

లేబర్ కార్డు ఉపయోగకరం



రక్త నమూనా సేకరణ రశీదు అందజేస్తున్న బాబు

సంగెం : లేబర్ కార్డు కలిగిన వారికి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుండేటి బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఎస్ఈ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో లేబర్‌కార్డు కలిగినవారికి ఉచితంగా రక్త, మూత్ర పరీక్షల నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, స్థానిక నాయకులు, సీఎస్ఈ జిల్లా కోఆర్డినేటర్ సాయిరాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'గద్దర్ యాది'ని విజయవంతం చేయాలి



సమావేశంలో నినాదాలు చేస్తున్న వామపక్ష పార్టీ, ప్రజా సంఘాల నాయకులు

నర్సంపేట : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ యాది సభను విజయవంతం చేయాలని వివిధ రాజకీయ, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 20వ తేదీన నర్సంపేటలో నిర్వహించే గద్దర్ యాది సభను విజయవంతం చేయాలన్నారు. యాది సభను రాజకీయాలకు అతీతంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఐక్య వేదికగా ఏర్పడి సభను విజయవంతం చేయాలని తీర్మానించారు. అనంతరం గద్దర్ యాది సభ ఐక్య వేదిక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా జనగాం కుమారస్వామి, కో కన్వీనర్లుగా నాగెల్లి వెంకటనారాయణ, కల్లెపల్లి ప్రణయ్‌దీప్, డ్యాగల శ్రీనివాస్, షేక్ జావెద్, సాంబరాతి మల్లేషం, గుంటి వీరప్రకాశ్, గిరగాని శ్రీనివాస్, ఎస్‌కె.సర్దార్, వాసునాయక్, తప్పెట రమేష్, ఎస్‌కె.యాకుబ్, సమ్మయ్యనాయక్, జెత్రిపోతుల ప్రభాకర్, ఎండి.అలీ, భూక్యా సమ్మయ్యనాయక్, గుగ్రం అజయ్, జనగాం లక్ష్మణ్, ప్రభాకర్, గోవర్దన్, అడ్డూరి రాజు, గన్నారపు సదానందం, జన్ను సాంబయ్య, కట్ల రాజేందర్‌లను ఐక్య వేదిక కమిటీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మత్తడి కష్టాలు తీరేదెన్నడో?



మత్తడిపై నుంచి వెళ్తున్న ప్రయాణికులు



ధ్వంసమైన ఎల్లూర్‌రంగంపేట మత్తడి కం రోడ్డు

- ఉధృతికి ధ్వంసమైన మత్తడి కం రోడ్డు
- ప్రమాదపుటంచున ప్రయాణం
- నిత్యం ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, రైతులు, కూలీలు.

సంగెం : మత్తడి కష్టాలు తీరేదెన్నడోనని రైతులు, రైతు కూలీలు, ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని ఎల్లూర్‌రంగంపేట చెరువు మత్తడి కం రోడ్డు గతంలోనే ధ్వంసమైంది. మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా ఉండేది. దానికి తోడు ఇటీవల మండలంలో కురిసిన భారీ వర్షాలకు అధికంగా వరదనీరు రావడంతో చెరువు కట్టకు ప్రమాదం ఏర్పడడంతో ముమ్మడివరం వైపు మత్తడిని కొంత మేర తొలగించారు. వరద ఉధృతికి మత్తడి కం రోడ్డు పలు చోట్ల భారీ గుంతలు పడింది. మత్తడి వరద తగ్గినప్పటికి ఈ మార్గం గుండా ప్రయాణించాలంటే రైతులు, రైతు కూలీలు, ఇతర ప్రయాణిలు భయంతో వణికిపోతున్నారు. ఎడ్లబండ్లు, ట్రాలీలు, ఆటోలు, ద్విచక్రవాహనాలు, కాలినడకన వెళ్లేవారు పలువురు నీటిలో గుంతలు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గం గుండా సంగెం మండలం నుంచి చెన్నారావుపేట మండలంలోని గ్రామాలకు, గీసుకొండ మండలం కొమ్మాల అంగడికి వెళ్లే వారు ఇతర మండలాలు, గ్రామాలకు వెళ్లే వారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వరి నాట్లు వేసే సమయం కాబట్టి చెరువు వెనకాలకు వెళ్లే రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు చెప్పినప్పటికి పట్టించుకునే నాథుడే లేరని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పడిన మత్తడి కం రోడ్డును తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సంక్షేమ పథకాల ఘనత కాంగ్రెస్‌దే!



నర్సంపేట రూరల్ : ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటుచేసింది కూడా కాంగ్రెస్సేనని, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 30 కుటుంబాలు ఆయా పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వారికి మాధవరెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదారంగా ఆహ్వానించారు. నాయకులు తోకల శ్రీనివాస్, పాలాయి శ్రీనివాస్, కత్తి కిరణ్, గజ్జిరాజు, ఐలోని అశోక్, శివగణేష్, మహేందర్, గోడిశాల సురేష్, మహమ్మద్ ఫిరోజ్, కత్తి వేణు, వెంకన్న, రాజు, వెంకటయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.